www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 12 ఫిబ్రవరి 2025



స్విమ్స్ బ్లడ్‌సెంటర్‌కు అవార్డు

తిరుపతి సిటీ : స్విమ్స్ బ్లడ్ సెంటర్ అందించిన ఉత్తమ సేవలకు నేషనల్ బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూజన్ కౌన్సిల్ అవార్డును అందుకున్నట్లు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ అన్నారు. కేరళ రాష్ట్రం కొచ్చిలో నేషనల్ బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూజన్ కౌన్సిల్ రక్తమార్పిడి సేవలపై సమీక్షా సమావేశాలు ఫిబ్రవరి 5, 6 తేదీల్లో జరిగాయి. ఆంధ్రప్రదేశ్ నుంచి ప్రాతినిధ్యం వహించిన స్విమ్స్ బ్లడ్ సెంటర్‌కు ప్రతిభా అవార్డు, ప్రశంసాపత్రాలతో సత్కరించినట్లు పేర్కొన్నారు. అవార్డు అందుకున్న డాక్టర్ సురేష్‌బాబు, సీనియర్ టెక్నీషియన్ పి.హరిప్రసాద్, ఎంఎస్‌డబ్ల్యు బి.శ్రీదేవిలను అభినందించారు.

తిరుపతి పురవీధుల్లో...

రెపరెపలాడిన 'పుస్తకం'

- దుండగులను అరెస్టు చేయాలని డిమాండ్
- పుస్తక ప్రియుల ఐక్యవేదిక ప్రదర్శన

ప్రజాశక్తి - తిరుపతి సిటి

తిరుపతి పురవీధుల్లో మంగళవారం సాయంత్రం పుస్తకం రెపరెపలాడింది. తిరుపతి పుస్తక ప్రదర్శనపై గత శనివారం రాత్రి జరిగిన మతోన్మాదుల దాడికి వ్యతిరేకంగా 'తిరుపతి పుస్తక ప్రియుల ఐక్య వేదిక' ఆధ్వర్యంలో కవులు, రచయితలు, పుస్తక ప్రియులు, పలు ప్రజాసంఘాల ప్రతినిధులు పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శన నిర్వహించారు. ప్రతి ఒక్కరి చేతిలో పుస్తకం ఎత్తిన జెండాగా రెపరెపలాడింది. మంగళవారం సాయంత్రం బాలాజీ కాలనీలోని పూలే విగ్రహానికి పూల మాలలు వేసి, నినాదాలు చేస్తూ ప్రదర్శన సాగింది. ప్రదర్శన ప్రారంభానికి ముందు 'తిరుపతి పుస్తక ప్రియుల ఐక్య వేదిక' కన్వీనర్ వాకా ప్రసాద్ మాట్లాడుతూ పుస్తకాలపైన దాడి చేయడం హేయమైన చర్యని, ఇది ప్రజాస్వామ్యానికి విఘాతమని అన్నారు. ఏ పుస్తకాలు చదవాలి, ఏ పుస్తకాలు చదవకూడదో నిర్ణయించడానికి వీళ్ళెవరని ప్రశ్నించారు. ఒక బుక్ స్టాల్ నుంచి పుస్తకాన్ని లాక్కుని చించి పోగులు పెట్టి, దగ్ధం చేయడానికి యత్నించిన దుండగులు, విశాలాంధ్ర పుస్తక స్టాల్ పైనా దాడి చేసి ఈ.వి. పెరియార్ పుస్తకాలను అమ్మరాదని తీసేయించారని గుర్తు చేశారు. పుస్తకాల స్టాల్స్ పై దాడి చేసిన దుండగులను అరెస్టు చేయాలని నినాదాలు చేశారు. నినాదాల్లో ప్రధానంగా 'నూరుపువ్వులు వికసించని, వేయి ఆలోచనలు సంఘర్షించనీ' 'అన్నదమ్ముల వలెను జాతులు మతములన్నియు మెలగవలెనోయ్' 'పుస్తకాలు జ్ఞాన నేత్రాలు' 'పుస్తకాలను చించినంత మాత్రాన, వాటిలోని భావాల్ని చంపలేరు' అంటూ పెద్దపెట్టున నినాదాలు చేశారు.

ఈ ప్రదర్శన ఆఫీసర్స్ క్లబ్ సెంటర్, ఎస్పీ ఆఫీస్, ప్రకాశం రోడ్డు, చతుర్ముఖ ఆంజనేయ స్వామి ఆలయం సెంటర్ మీదుగా గాంధీ రోడ్డులోకి ప్రవేశించింది. రోడ్లకు ఇరువైపులా ఉన్న ప్రజలంతా ప్రదర్శకులు పట్టుకున్న పుస్తకాలను ఆసక్తిగా తిలకించారు. విశాలాంధ్ర వద్ద ఆగి నినాదాలు చేశారు. నాలుగ్గాళ్ళ మండపం వద్ద అంతా వలయాకారంలో గుమిగూడి దాడికి నిరసనగా వక్తలు ప్రసంగించారు.

ఈ కార్యక్రమంలో రచయితలు భూమన్, మధురాంతకం నరేంద్ర, ఆర్.ఎం. ఉమా మహేశ్వరరావు, రచయిత, జర్నలిస్టు రాఘవ, మూరి శెట్టి గోవిందు, పేరూరు బాలసుబ్రమణ్యం, వెంకటరత్నం, యమలా సుదర్శన్, నాగులూరి దయాకర్, గొడుగు చింత గోవిందయ్య, నిర్మల, జనవిజ్ఞాన వేదిక నుంచి రెడ్డెప్ప, సాహితీ స్రవంతి నుంచి ఓ. వెంకటరమణ, వేమన వి జ్ఞాన కేంద్రం నుంచి నాగార్జున, తిరుపతి బాలోత్సవం నుంచి నడ్డి నారాయణ, అభ్యుదయ వేదిక నుంచి కడియాల వెంకటరమణ, పౌర చైతన్య వేదిక జిల్లా కార్యదర్శి ఏ.ఎన్ పరమేశ్వర్ రావు, తిరపతి జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు సాకం నాగరాజ, అరసం జిల్లా అధ్యక్షులు యువశ్రీ మురళి, శంకరంబాడి సుందరాచారి పీఠం నుంచి మస్తానమ్మ, తెలుగు భాషోద్యమ సమితి నుంచి తమటం రామచంద్రా రెడ్డి, ఐద్వా తరపున సాయి లక్ష్మి, ఎస్.యూ.సీ.ఐ నుంచి లక్ష్మి, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి, సీపీఎం జిల్లా కార్యదర్శి నాగరాజు, సీపీఐ నాయకుడు రామానాయుడు, ఆర్‌పిఐ వ్యవస్థాపకులు పి.అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇండస్ట్రియల్ కారిడార్ నిర్వాసితులకు నష్టపరిహారం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

చెన్నయ్– బెంగళూర్ ఇండస్ట్రియల్ కారిడార్ ప్రాజెక్టు అబివద్ధి కొరకు కొత్తపట్నం గ్రామ (కోట మండలం) తమ్మిన పట్నం (చిల్లకూరు మండలం) లో ప్రభుత్వ భూముల సాగులో ఉన్న రైతులను క్షేత్రస్థాయిలో పరిశీలించి నష్ట పరిహారం అందిస్తామని కలెక్టర్ ఎస్ వెంకటేశ్వర్ తెలిపారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నందు చెన్నై, బెంగళూర్ ఇండస్ట్రియల్ కారిడార్ ప్రాజెక్టు అబివద్ధి కొరకు ప్రభుత్వ భూములు సాగులో ఉన్న రైతులకు నష్ట పరిహారం విడుదల పై జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్, గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా తో కలిసి సమావేశం నిర్వహించారు. ఇండస్ట్రియల్ కారిడార్‌వల్ల పరిశ్రమలు వస్తాయని, ఉద్యోగావకాశాలు ఉంటాయని తెలిపారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిహారం అందిస్తామన్నారు. తిరుపతి నెల్లూరు, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్లు విజయ్ భరత్ రెడ్డి, శివ కుమార్, కోట, చిల్లకూరు మండలాల తాసిల్దారులు, సర్వేయర్లు, వీఆర్వోలు, వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

గడువులోగా సమస్యలు పరిష్కరించాలి : కలెక్టర్

ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే అర్జీలను నిర్ణీత గడువులోగా రీ ఓపెన్‌కు ఆస్కారం లేకుండా నాణ్యతతో పరిష్కారం చూపేలా సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ ఆదేశించారు. మంగళవారం జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. పరిష్కారం చూపలేని అర్జీలకు స్పష్టంగా అర్జీదారునికి ఎండార్స్‌మెంట్ చేసి తెలపాలని ఆదేశించారు. జిల్లా రెవెన్యూ అధికారి నరసింహులు, డిప్యూటీ స్పెషల్ కలెక్టర్ రోస్మాండ్ పాల్గొన్నారు.

ఆ గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించండి

వ్యకాసం రాష్ట్ర కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - సత్యవేడు

సత్యవేడు మండలంలోని శ్రీసిటీ పరిధిలో ఇరుగుళం, కొల్లడం, పెద్దిటిపాకం గ్రామాల్లో ప్రభుత్వం 144 ఎకరాలను పరిశ్రమల కోసం బలవంతంగా సేకరిస్తోందని, అలాకాకుండా 2013భూసేకరణ చట్టం ప్రకారం గ్రామసభలు నిర్వహించి గ్రామస్తుల అభిప్రాయాలను తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. గ్రామాల్లోకి రైతు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులను రానీకుండా అడ్డుకుంటూ శ్రీసిటీకి కొమ్ముగాస్తున్న ఆకతాయిలపై చర్యలు తీసుకోవాలన్నారు. మంగళవారం ఇరుగుళం, కొల్లడం, పెద్దిటిపాకం గ్రామాల్లో రైతుసంఘం జిల్లా అధ్యక్షులు దాసరి జనార్ధన్‌తో కలిసి పర్యటించారు. గ్రామస్తుల అభిప్రాయాలను సేకరించారు. అభివృద్ధికి తాము వ్యతిరేకం కాదని, ఒకవేళ భూములను తీసుకుంటే 2013 భూసేకరణ చట్ట ప్రకారం ఆ భూములను తీసుకోవాలన్నారు. శ్రీసిటీ పేరు చెప్పుకుంటూ దాదాపు 55 మంది ఆకతాయిలు తమ వద్దకు వచ్చి గ్రామాల్లో ప్రజలను కలవనీకుండా భయభ్రాంతులకు గురిచేసి దాడికి పూనుకోవడం పట్ల మండిపడ్డారు. దాడికి పాల్పడిన వారిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ప్రాంతంలో తరతరాలుగా నివసిస్తున్న దళితులు, బీసీలకు ఎకరా, అర ఎకరా మించి ఎవరికీ భూములు లేవని, వ్యవసాయం చేసుకుంటూ గొర్రెలు మేపుకుంటూ జీవనాధారం సాగిస్తున్నారన్నారు. ఈ గ్రామాల పరిధిలో కొందరు పెత్తందారులు రౌడీలను గూండాలను పెంచి పోషిస్తూ ఎవరూ తిరగబడకుండా, ప్రశ్నించకుండా గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఈ మూడు గ్రామాల పరిధిలో దాదాపు 300 కుటుంబాలు సర్వం కోల్పోయారని, భూములు కోల్పోతున్న రైతులే కాకుండా, వాటిపై ఆధారపడి జీవిస్తున్న వ్యవసాయ కూలీలకు, ఉపాధి కూలీలకు మెరుగైన ప్యాకేజీ అందించాలన్నారు. అభివృద్ధికి తాము వ్యతిరేకం కాదన్నారు. ప్రభుత్వం స్పందించి 2013 భూసేకరణ చట్టం ప్రకారం భూసేకరణ చేయాలని, రైతులకు, వ్యవసాయ కూలీలకు మెరుగైన ప్యాకేజీ ఇచ్చి ఆదుకోవాలని, ఆకతాయిలను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా రైతుసంఘం అధ్యక్షులు దాసరి జనార్ధన్, వ్యకాసం నాయకులు మెలుగు రమేష్, మునస్వామి, కిష్టయ్య పాల్గొన్నారు.

కుక్కంబాకం దళితులకు పట్టాలివ్వాలి

బిఎన్ కండ్రిగ : కుక్కంబాకం దళితులకు సాగుభూమి పట్టాలు ఇవ్వాలని సిపిఎం ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దాసరి జనార్ధన్, శ్రీకాళహస్తి –బిఎన్ కండ్రిగ ప్రాంతీయ కమిటీ కార్యదర్శి గంధం మణి మాట్లాడుతూ కుక్కంబాకం రెవెన్యూ సర్వే నంబర్ 81లో ఉన్న 82 ఎకరాల ప్రభుత్వ భూమిలో దళితులు పదేళ్లుగా సాగు చేస్తున్నా పట్టాలు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సర్వే నిర్వహించి, సాగులో ఉన్న భూములకు పట్టాలివ్వాలని కోరారు. తహశీల్దార్ ఐ.సుబ్రమణ్యం స్పందిస్తూ దళితులంతా ఐక్యంగా ముందుకొస్తే పట్టాలు ఇప్పించడానికి ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నలుగురి రమణయ్య, జె.కె రమణయ్య, సుబ్బయ్య, సుబ్బమ్మ, సుజాత, మల్లమ్మ పాల్గొన్నారు.

'అబాకస్'లో ఎంజీఎం విద్యార్థినికి మొదటి స్థానం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

తిరుపతి వేదికగా విశ్వం ఎడ్యుటెక్ ఏ స్కిల్ కరికులం కంపెనీ నిర్వహించిన జోనల్ లెవెల్ స్టార్ జూనియర్స్ అబాకస్ పోటీల్లో ఎంజీఎం స్కూల్ విద్యార్థిని కే. హనీషా సత్తా చాటింది. ఈ పోటీల్లో జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రయివేట్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు హాజరు కాగా హనీషా అందరికంటే ప్రతిభ కనబరిచి మొదటి స్థానం దక్కించుకుంది. అబాకస్ రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించిన హనీషాను ఎంజీఎం గ్రూప్ డైరెక్టర్ గుడ్లూరు ఐశ్వర్య అభినందించారు.

ఎల్‌ఎల్‌బిలో మోహనలక్ష్మికి బంగారు పతకం

ప్రజాశక్తి - క్యాంపస్

తిరుపతిలో అనంత న్యాయ కళాశాల విద్యార్థిని మోహనలక్ష్మికి ఎల్.ఎల్.బి మూడు సంవత్సరాల డిగ్రీలో అత్యధిక మార్కులు సాధించి గోల్డ్ మెడల్ అవార్డును సొంతం చేసుకుంది. ఈ అవార్డును స్థానిక తిరుపతి మహతి ఆడిటోరియంలో జరిగిన గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమంలో ఆచార్య నాగార్జున వర్సిటీ మాజీ వీసి నుంచి గోల్డ్ మెడల్‌ను అందుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్. బి.మోహనలక్ష్మి మాట్లాడుతూ తనకు గోల్డ్ మెడల్ రావడం చాలా సంతోషంగా వుందని, తనలో ప్రతిభను గుర్తించి ప్రోత్సహించిన తల్లిదండ్రులకు, గురువులకు కృతజ్ఞతలు తెలిపారు. మంచి లాయర్‌గా గుర్తింపు తెచ్చుకుని జడ్జి స్థాయికి ఎదగాలన్నది తన లక్ష్యమని చెప్పారు.

అలిపిరిలో ఫుడ్‌సేఫ్టీ అధికారుల దాడులు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ ఆదేశాల మేరకు అలిపిరిలో ఫుడ్‌సేఫ్టీ అధికారులు ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. అలిపిరి మెట్ల మార్గంలో కల్తీ పసుపు, కుంకుమ ఆహార పదార్థాల విక్రయం జరుగుతోందని ఫిర్యాదులు అందిన నేపథ్యంలో జిల్లా ఆహార భద్రత కంట్రోలర్, ఫుడ్‌సేఫ్టీ అధికారులు, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. అనుమానిత కల్తీ పసుపు, కుంకుమ విక్రయిస్తున్న వాటిని సీజ్ చేశారు. వారికి అవగాహన కల్పించిన నేపథ్యంలో వీధి విక్రయదారులు బ్రాండెడ్ కుంకుమ, పసుపు విక్రయాలు చేపట్టారు. తనిఖీ చేసిన వారిలో జిల్లా ఫుడ్ సేఫ్టీ కంట్రోలర్ వెంకటేశ్వర్‌రావు, అధికారులు మద్దిలేటి, జగదీష్ ఉన్నారు.

బస్టాండ్ మరుగుదొడ్లలో కాంట్రాక్టర్ల నిలువుదోపిడీ

ప్రజాశక్తి - తిరుపతి సిటి

బస్టాండ్ ప్రయాణికులకు ఉచితంగా మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని, విచారణ కేంద్రంలో రెగ్యులర్ సిబ్బందిని నియమించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు జి.బాలసుబ్రమణ్యం డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎపిఎస్‌ఆర్‌టిసి బస్టాండ్‌లో ప్రయాణికులను, భక్తులను టాయిలెట్ల వద్ద కాంట్రాక్టర్లు నిలువు దోపిడీ చేస్తున్నారన్నారు. మూత్ర విసర్జనకు 10, మలవిసర్జనకు 25 రూపాయలు వసూలు చేయడం అన్యాయమన్నారు. ఆర్టీసి వారికి కట్టాలంటే ఆ మాత్రం వసూలు చేయక తప్పదని కాంట్రాక్టర్లు దబాయిస్తుండటం చూస్తుంటే ఉన్నతాధికారులే ఈ విధమైన వసూళ్లకు పాల్పడుతున్నారని అర్థమవుతుందన్నారు. ప్రయాణికుల వద్ద బస్టాండ్ నిర్వహణకు సెస్ రూపంలో టికెట్‌తో పాటు ధర నిర్ణయించి వసూలు చేస్తున్నారన్నారు. ఫిబ్రవరి 12న జరుగు టెండర్లను రద్దు చేయాలన్నారు. టాయిలెట్లు, ఎంక్వయిరీ ప్రైవేట్‌కు అప్పగించే ప్రయత్నం మానుకుని మరుగుదొడ్లను ఉచితంగానూ, విచారణ కేంద్రాలను రెగ్యులర్ సిబ్బందితో నిర్వహించాలని డిమాండ్ చేశారు.

మంత్రి నారా లోకేష్ హామీ నెరవేర్చాలి : ఎస్‌ఎఫ్‌ఐ

క్యాంపస్ : రాష్ట్రంలోని అన్ని విశ్వ విద్యాలయాలకు ఉమ్మడి ప్రవేశ పీజీ పరీక్ష నిర్వహించడం వల్ల అడ్మిషన్లు తగ్గిపోతున్నాయని, ఏ యూనివర్సిటీకి ఆ యూనివర్సిటీ పరిధిలో పీజీ పరీక్ష నిర్వహించే అవకాశం కల్పిస్తానని ఎన్నికలకు ముందు మంత్రి నారా లోకేష్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అక్బర్, రవి డిమాండ్ చేశారు. 2021 ముందు పీజీసెట్‌ల నిర్వహణ ఏ యూనివర్సిటీకి ఆ యూనివర్సిటీ పీజీ ప్రవేశాలు నిర్వహించేవారని, 2021లో వైఎస్‌ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం నూతన జాతీయ విద్యా విధానం 2020లో భాగంగా, కరోనా సాకుతో ఉమ్మడి పీజీ ప్రవేశాలకు అవకాశం కల్పించారన్నారు. దీనివల్ల విశ్వ విద్యాలయాల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిందన్నారు. గ్రామాల్లో విద్యార్థులకు దరఖాస్తులు ఎప్పుడనేది తెలియకుండా పోతుందన్నారు. ఉమ్మడి పీజీ అడ్మిషన్లను రద్దు చేసి, ఏ యూనివర్సిటీ ఉమ్మడి ప్రవేశ పరీక్ష ఆ యూనివర్సిటీ ప్రవేశాలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. అయితే ఈనెల 8వ తేదీన ఉమ్మడి ప్రవేశాలకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేశారన్నారు. అందులో పీజీ సెట్ ఉమ్మడిగానే ఉందని పేర్కొన్నారు. దీనివల్ల రాష్ట్రంలోని నిరుపేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉందని పేర్కొన్నారు.

కళలు సంస్కృతికి దర్పణం

అలరించిన ఘంటసాల స్వరాభిషేకం

ప్రజాశక్తి - తిరుపతి సిటి

కళలు, కళాకారులు మన సంస్కృతిలో భాగమని, వాటిని సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తిరుపతి మాజీ ఎమ్మెల్యే మోహన్, చిత్తూరు జడ్పీ మాజీ సీఈవో భరత్ రెడ్డి, జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు పీవీఎస్ రవికుమార్, నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మాజీ ప్రిన్సిపల్ బి.వెంకటరమణ పేర్కొన్నారు. పద్మశ్రీ ఘంటసాల వర్ధంతిని పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాషా సాంస్కతిక శాఖ సహకారంతో అమరావతి ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘంటసాల స్వరాభిషేకం ఉత్సవాలు మంగళవారం తిరుపతి మహతి ఆడిటోరియంలో వేడుకగా నిర్వహించారు. అమరావతి ఆర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పి చంద్రశేఖర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ వేడుకలకు అతిధులుగా విచ్చేసిన ప్రముఖులు మాట్లాడుతూ భారతదేశం విభిన్న భాషలకు సంస్కతులకు నిలయమన్నారు. మన సంస్కతిని ప్రతిబింబించేది కళలు కళాకారులేనని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు భాషా సంస్కతులను పరిరక్షించేందుకు ఎంతగానో దోహదం చేస్తున్నాయని వివరించారు. ఈ సందర్భంగా జానపద, నత్యాలు, కోలాటాలు, భరతనాట్యం, కూచిపూడి వంటి సాంస్కతిక ప్రదర్శనలు ఆహుతులను ఎంతగానో అలరించాయి. ఈ సందర్భంగా అతిథులను, కళాకారులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అమరావతి ఆర్ట్స్ అసోసియేషన్ కార్యదర్శి శివాజీ, సభ్యురాలు సరస్వతి పాల్గొన్నారు.

ఘంటసాలకు ఘన నివాళి

ఘంటసాల మాస్టార్ 52వ వర్ధంతి పురస్కరించుకుని తిరుపతి ఫిల్మ్‌సొసైటీ కార్యవర్గ సభ్యులు మంగళవారం నివాళి అర్పించారు. అధ్యక్షులు వైఎస్ బాబు, కార్యదర్శి సిఆర్‌కె శేషగిరిరావు మాట్లాడుతూ ఘంటసాల పాటలు చిరస్మరణీయమని అన్నారు.

ఈ కార్యక్రమంలో ఎస్.బుజ్జిబాబు నాయుడు, ఎస్.సుబ్రమణ్యం, భాస్కర్, బండి మధుసూదన్‌రెడ్డి, జి.శాంతావాణి పాల్గొన్నారు.

శివరాత్రికి కేంద్ర మంత్రులకు ఆహ్వానం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి మంగళవారం రాజధాని ఢిల్లీలో బిజీబిజీగా గడిపారు. పలువురు కేంద్రమంత్రులను, ఎంపీలను కలిసి ముక్కంటి, గుడిమల్లం మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికలను అందజేశారు. మంత్రులు, ఎంపీలను మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించారు. కేంద్ర విద్యా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, కేంద్ర కార్మిక, ఉపాధి, యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రి మన్సుఖ్ మాండవీయ, కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల మంత్రి హెచ్.డి. కుమారస్వామి, మాజీ ప్రధానమంత్రి, కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి హెచ్.డి. దేవెగౌడ, అనకాపల్లి ఎంపీ రమేష్, విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని, అమలాపురం ఎంపీ హరీష్ బాలయోగిలను ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆహ్వానించారు. అనంతరం కేంద్ర విద్యా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తో జరిగిన సమావేశంలో ఆంధ్రప్రదేశ్ అంతటా విద్యార్థులకు ప్రయోజనం చేకూర్చేలా మెరుగైన విద్యా మౌలిక సదుపాయాలు, డిజిటల్ అభ్యాస వనరులు, నైపుణ్య అభివద్ధి కార్యక్రమాల అవసరాన్ని ఆయన నొక్కి చెప్పారు. శాప్ చైర్మన్ రవి నాయుడుతో పాటు, ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రి మన్సుఖ్ మాండవీయను కలిశారు. కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించి, ఈ కార్యక్రమాలకు అవసరమైన సహాయాన్ని అందిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

ధరలు పెరిగాయ్...ఉపకార వేతనం పెంచండి..!

ప్రజాశక్తి - క్యాంపస్

రాష్ట్రంలో గత 15 సంవత్సరాల క్రితం పశువైద్య విద్యార్థులకు ఇచ్చే ఉపకార వేతనాన్ని ప్రస్తుతం పెరిగిన నిత్యవసర వస్తువుల ధరలకు అనుకూలంగా పెంచి ఇచ్చేలా సత్వరం ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పశు వైద్య విద్యార్థుల సంఘం నేతలు డిమాండ్ చేశారు. శ్రీ వేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయంలో పశు వైద్య విద్యార్థుల నిరవధిక సమ్మె బుధవారం 9వ రోజుకు చేరుకుంది. విద్యార్థుల నిరసన తారస్థాయికి చేరుకుంటూ, స్టైఫండ్ పెంపుదల కోసం పటిష్ఠంగా కొనసాగుతోంది. 5వ రిలే నిరాహార దీక్షలో భాగంగా, 9 మంది పశువైద్య విద్యార్థులు దీక్షకు కూర్చున్నారు. శ్రీ వెంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీ డీన్ డాక్టర్ వీరబ్రహ్మయ్య, ఇంచార్జ్ రిజిస్ట్రార్ డాక్టర్ శ్రీలత, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ డాక్టర్ చంగల్ రాయల్, డైరెక్టర్ ఆఫ్ ఎక్స్టెన్షన్ డాక్టర్ శోభామణి, అసోసియేట్ డీన్ డాక్టర్ జగపతి రామయ్య నిరవధిక సమ్మె జరుగుతున్న శిబిరానికి వచ్చి విద్యార్థులతో మాట్లాడుతూ విద్యార్థులను తరగతులకు వెళ్ళమని నిరవధిక సమ్మెను విరమించాలని సూచించారు. మెడికల్ విద్యార్థుల స్టైఫండ్ కు సమానంగా పెరిగేంతవరకు సమ్మెను విరమించే ప్రసక్తి లేదని విద్యార్థులు స్పష్టం చేవారు. స్పందించకుంటే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామన్నారు.

యూనివర్సిటీల్లో జీతాలు రాక ఉద్యోగులు విలవిల

ప్రజాశక్తి - క్యాంపస్

దేశంలో ఎంతో ప్రతిష్టాత్మకమైన శ్రీ వేంకటేశ్వర, శ్రీ పద్మావతి మహిళా విశ్వ విద్యాలయాల్లో పనిచేసే శాశ్వత బోధన, బోధనేతర ఉద్యోగులకు జనవరి నెల జీతాలు అందక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఫిబ్రవరి నెల సగం పూర్తయినా జీతాలు లేకపోవడంతో నెలనెలా కట్టే ఈఎంఐలు, చీటీలు, పాలసీలు, సేవింగ్స్, విద్యార్థుల పిల్లల ఫీజులు సకాలంలో చెల్లించలేకపోతున్నామని వారు వాపోతున్నారు. తమను చూస్తే వేలకు వేలు జీతాలు తీసే మధ్యతరగతి ఉద్యోగులుగా అందరూ చూస్తారని, అయితే ఇంతవరకూ తమకు జీతాలు రాలేదంటే ఎవరూ నమ్మడం లేదని, ఉన్నతాధికారులు స్పందించి సకాలంలో ప్రతి నెలా మొదటి తారీఖే జీతాలను ఇచ్చేలా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

'డ్రోన్ల'తో నేరాలకు అడ్డుకట్ట

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

మంగళం వద్ద తనిఖీలు

మంగళం పరిధిలోని తిరుపతి–కరకంబాడి మార్గంలో మంగళవారం తిరుచానూరు పోలీసులు, రవాణా శాఖ అధికారులు ముమ్మరంగా వాహన తనిఖీలను చేపట్టారు. హెల్మెట్ తప్పకుండా ధరించాలని, హెల్మెట్ లేని వారికి వంద రూపాయలు చొప్పున అపరాధ రుసుమును విధించినట్లు ఎస్సై జగన్నాథం తెలిపారు. పర్మిట్లు, ఓవర్ లోడింగ్ వాహనాలపై రవాణా శాఖ అధికారులు అపరాధ రుసుమును విధించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌ఐ బాబు, కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

డ్రోన్ల వినియోగంతో.....

మంగళం పరిధిలోని హ్యాబిటేషన్ల పరిధిలో ఎవరైనా బహిరంగంగా మద్యం సేవించడం, గంజాయి వినియోగం, అల్లరి చేష్టలు చేసేవారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇటీవల తిరుపతి జిల్లా ఎస్పీ తిరుపతి జిల్లా పరిధిలో మత్తు పదార్థాల వినియోగం విపరీతంగా పెరిగిందని తెలిపారు. ఈ నేపథ్యంలో మత్తు పదార్థాలు సేవించే ప్రదేశాలను సులువుగా గుర్తించి ఆ ప్రదేశంలో వారిని అదుపులోకి తీసుకోవడానికి డ్రోన్ల వినియోగాన్ని అందుబాటులోకి తీసుకొస్తున్నామని ఎస్పీ ప్రకటించారు. ఇప్పటికే జిల్లా పరిధిలో ఉన్న పోలీస్ స్టేషన్లో కొంతమంది సిబ్బందికి డ్రోన్ వినియోగంపై నిపుణులతో తగిన శిక్షణ ఇస్తున్నారు. మంగళం అటవీ సరిహద్దు ప్రాంతం కావడం, ఎర్రచందనం అక్రమ రవాణా, గంజాయి వినియోగ స్థావరాలను గుర్తించడానికి డ్రోన్లు ఎంతగానో ఉపకరిస్తాయని పోలీసు అధికారులు అంచనా వేసినట్లు తెలుస్తోంది. ఇదే జరిగితే మంగళం ప్రాంతంలో అసాంఘిక కార్యక్రమాలకు దాదాపు చెక్ పడినట్లే.

రాత్రుల్లో స్పెషల్ పార్టీ పోలీసులతో ప్రత్యేక నిఘా

ప్రజాశక్తి - తిరుపతి సిటి

జిల్లాలో ఎన్ఫోర్స్మెంట్ విధులను పెంచి, నేర నియంత్రణ చేస్తూ, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు తావు లేకుండా ఉక్కు పాదం మోపి, శాంతిభద్రతల పరిరక్షణ చేయాలని జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు పోలీసులకు సూచించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతిరోజూ స్పెషల్ పార్టీ పోలీసులతో జిల్లాలోని ముఖ్య పట్టణాల్లో గస్తీ తిరుగుతూ, రాత్రిపూట రోడ్లపై తిరుగుతున్న 165 మంది అనుమానిత వ్యక్తులను పోలీస్ స్టేషన్‌కు తరలించి కౌన్సెలింగ్ ఇచ్చారు. గంజాయి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేస్తూ సుమారు 41.5 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. బహిరంగంగా మద్యం సేవించే వారిపై 913 కేసులను నమోదు చేసి, 913 మందికి కోర్టులో జరిమానాలు వేశామని, బహిరంగంగా మద్యం సేవించే 81 ప్రదేశాలను గుర్తించామన్నారు. 119 మంది వాహనదారులపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేసి, రోడ్లకు ఇరువైపులా రోడ్లను ఆక్రమించి ట్రాఫిక్ కు అంతరాయం కలిగించే 663 మంది చిరు వ్యాపారులపై టౌన్ న్యూసెన్స్ యాక్ట్ కేసులను నమోదు చేసి కోర్టులో జరిమానాలు, శిక్షలు విధించామన్నారు. సైబర్ క్రైమ్, లోన్ యాప్స్, హెల్మెట్ ధారణ, రహదారి భద్రత నియమాలు, కొత్త క్రిమినల్ చట్టాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. చట్టాన్ని అతిక్రమిస్తే ఎంతటి వారి పైన అయినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని ఎస్పీ తెలిపారు.

అందుబాటులో గుండె పోటు ఇంజక్షన్

గుండెపోటు నివారణ ఇంజక్షన్ గురించి అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రూప, మాధురి

ప్రజాశక్తి -కోట : గుండెపోటు వచ్చిన వెంటనే ఒక గంటలోపు ఇంజక్షన్ఇచ్చి ప్రాణాలు కాపాడవచ్చని కోట ప్రభుత్వ ఆసుపత్రి మెడికల్ ఆఫీసర్లు రూప, మాధురిలు తెలిపారు. కోట ప్రభుత్వ ఆసుపత్రిలో టెంక్టిప్లస్ ఇంజక్షన్ అందుబాటులో ఉందని తెలిపారు. మంగళవారం కోట, వాకాడు, చిట్టమూరు మండలాల నుండి వచ్చిన రోగులకు గుండెపోటుపై వెంటనే తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. టెంక్టిప్లస్ ఇంజక్షన్ 45 వేల రూపాయలు ఉంటుందని, ఇపుడు ఉచితంగా అందజేయడం జరుగుతుందన్నారు. ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా గుర్తింపు పొందిన ఆసుపత్రులలో యాంజియో ప్లాస్ట్, బైపాస్ సర్జరీలు ఉచితంగా చేస్తారని తెలియజేశారు.

వెట్టి చాకిరి, మానవ అక్రమ రవాణా నిర్మూలనకు కృషి చేయండి

కార్యక్రమంలో క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : వెట్టి చాకిరి, మానవ అక్రమ రవాణా నిర్మూలనకు కృషి చేయాలని రూప్స్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు పిలుపునిచ్చారు. మంగళవారం పుత్తూరు మండల పరిషత్, తాసిల్దార్ కార్యాలయాలలో ఎంపీడీవో రమేష్ బాబు, తాసిల్దారు వెంకటేశ్వర్లు క్యాలెండర్లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు పాల్గొన్నారు.

కృష్ణ సాగర్ చెరువులో హెచ్చరిక బోర్డు ఏర్పాటు

హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - యర్రావారిపాలెం: మండలంలోని ఉదయ మాణిక్యం గ్రామపంచాయతీ పరిధిలోని కృష్ణ సాగర్ చెరువు దురాక్రమణకు గురైనట్లు స్థానిక రైతులు రెవెన్యూ సిబ్బందికి అందించిన సమాచారం అందించారు. ఈ మేరకు మంగళవారం రెవెన్యూ సిబ్బంది హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. కృష్ణ సాగర్ ప్రభుత్వ ఆయకట్టులో ఎవరైనా దురాక్రమణకు పాల్పడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఐ, వీఆర్వో హరి, అధికారులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

హాలో బంజారా.. చలో సేవాగడ్

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ప్రధాన ముఖద్వారం ఎదుట సంత్ సేవాలాల్ 286వ జయంతి మహోత్సవ పోస్టర్లను గిరిజన నవ సమాజ్ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు శివశంకర్ నాయక్ మాట్లాడుతూ బంజారాలను చైతన్యపరిచిన జ్ఞాన జ్యోతి సేవాలాల్ మహారాజ్ అన్నారు. స్థిర నివాసాలు లేని బంజారాలను గుర్తించి వారికి తండా రూపంలో సుస్థిరం కల్పించారన్నారు. గత 25 సంవత్సరాలుగా సేవాలాల్ జయంతి ఉత్సవాలను అనంతపురం జిల్లా గుత్తి మండలం సేవాగడ్‌లో బంజారాలే నిర్వహిస్తున్నారని తెలిపారు. అక్కడకు వచ్చే భక్తులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మెరుగైన సదుపాయాలు కల్పించాలని కోరారు. సేవాలాల్ జయంతి ఫిబ్రవరి 15న కేంద్ర ప్రభుత్వం జాతీయ పండుగగా గుర్తించి సెలవు దినంగా ప్రకటించాలని, జయంతి ఉత్సవాలను ప్రభుత్వమే నిర్వహించాలని, జయంతి నిర్వహణకు 2 కోట్ల రూపాయలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన నవ సమాజ్ నాయకులు చంద్రశేఖర్, సునీల్, బాలు, అడ్వకేట్ మాసుమయ్య, భార్గవ్, సాయి, సూర్య, విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

బాలికల గురుకులానికి బ్లీచింగ్ వితరణ



పాఠశాలకు బ్లీచింగ్ అందిస్తున్న విద్యార్థిని

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: స్థానిక కాసాగార్డెన్ బాలికల గురుకులానికి శ్రీకాళహస్తి మండలం, చుక్కల నిడిగిల్లు గ్రామానికి చెందిన బీటెక్ విద్యార్థి చుక్కల పవన్ కుమార్ తన జన్మదినాన్ని పురస్కరించుకొని మంగళవారం 50 కేజీల బ్లీచింగ్ పౌడర్ వితరణగా అందజేశారు.తన చెల్లి చుక్కల గీతిక చేతుల మీదుగా బ్లీచింగ్‌ను గురుకులం ప్రిన్సిపాల్ మాధవీలతకు అందించారు. గురుకులం పరిశుభ్రతకు బ్లీచింగ్‌ను వినియోగించాల్సిందిగా కోరారు.

ఎన్ఎస్ఎస్ విద్యార్థులకు అభినందనలు

ప్రజాశక్తి - క్యాంపస్ : మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్, వై.ఎన్ కళాశాల జాతీయ సేవా విభాగం సంయుక్త ఆధ్వర్యంలో ఏడు రోజుల పాటు ఘనంగా జరిగిన శిబిరంలో శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం విద్యార్థినిలు ఎంతో ఉత్సాహంతో పాల్గొన్నారు. వారు అనేక నైపుణ్యాలు ప్రదర్శించడంతోపాటు ఎన్నో కొత్త నైపుణ్యాలను, సేవా దృక్పథాన్ని, మానవతా దృక్పథాన్ని నేర్చుకున్నారు. జాతీయ శిక్షణ శిబిరాన్ని విజయవంతంగా ముగించుకొని వచ్చిన ఆంధ్రప్రదేశ్ కంటింజెంట్ లీడర్ డా.వై.అనిత(యూనిట్ 16), వాలంటీర్స్ రీతిక, లావణ్య కుమారీలను, యూనిట్ 7, 8 ప్రోగ్రాం ఆఫీసర్లు మాధవి, స్వాతిలను విసి ఉమ, రిజిస్ట్రార్ రజిని, కోఆర్డినేటర్ విద్యావతి, ఎన్ఎస్ఎస్ రీజినల్ డైరెక్టర్ రామకృష్ణలు అభినందించారు.

మామిడికి.. మంచు దెబ్బ

- దట్టంగా కమ్ముతున్న పొగ మంచు
- రాలిపోతున్న పూత, పిందెలు
- ఆందోళనలో మామిడి రైతులు



మామిడి పూతకు మంచు దెబ్బ తగులుతోంది. కొద్ది రోజులుగా దట్టంగా కురుస్తున్న మంచుతో పూత మాడిపోతోంది. సాధారణంగామామిడి పంటలో డిసెంబర్-జనవరి నెలల్లో పూత వస్తుంది. ఈ ఏడాది డిసెంబర్ నుండి తీవ్రమైన పొగ మంచు కమ్ముతుండటంతో పూత నల్లగా తిరిగి, రాలిపోతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

మండలంలో మామిడి సాగు వివరాలు

ఎంప రాజుల కండ్రిగ	700 ఎకరాలు
పూడిసికెపురం	600
అంజూరు	200
కోవలూరు	150
తిమ్మినాయుడుగుంట	200
దిగువ పుత్తూరు	200
కాట్రపల్లి	150
కోటమంగాపురం	100
ఆదరం	200
మొత్తం	2500

ఎకరాల మామిడి తోటలు సాగుబడి

ప్రజాశక్తి - కేవిబి పురం: కేవిబి పురం మండల పరిధిలో అత్యధికంగా మామిడి పంటను రైతులు సాగు చేస్తుంటారు. ప్రస్తుతం మండలంలో ఉన్న రసాలు, బేనిష, బంగినపల్లి, బెంగుళూరు మామిడి రకాలు చెట్లకు పూత పూసింది. మరికొన్ని రకాలు పూత దశలో ఉన్నాయి. గత ఏడాది డిసెంబర్‌లో వర్షాలు కారణంగా కొంత పూత రాలిపోయింది. పూత రాని చెట్లు సైతం ఎక్కువగా ఉండటంతో రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. ఇటీవల కాలంలో కురుస్తున్న మంచు ప్రభావంతో పూత మాడిపోయి నేల వాలిపోతోంది. దట్టమైన మంచు ప్రభావంతో కొన్నిచోట్ల

చిన్న చిన్న మామిడి పిందెలు నేలరాలిపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తెల్లవారుజాము నుండి అధికంగా కురుస్తున్న మంచుతోపాటు, పగటిపూట ఉష్ణోగ్రతలు పెరిగిపోవడంతో మామిడి పూత పిందెలపై తామర పురుగు ఆశిస్తోంది. దీంతోపాటు చెట్లకు తెగులు సోకి మామిడి పంటను దెబ్బతీస్తున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఉద్యాన శాఖధికారుల సూచనలు

మంచు ప్రభావంతో మామిడి తోటలను తెగుళ్ల బెడద వెంటాడుతుంది. వీటి నివారణకు దయమోదాక్షమ్ 0.5 గ్రాములు, హేక్స్ కోనోజోల్ 2 లీటర్లు కలిపి తెగులు చోకిన మామిడి పూతలపై పిచికారి చేయాలి. దీంతోపాటు వేప నూనె రెండు ఎంఎల్, ఒక లీటర్ నీటిలో కలిపి పిచికారి చేయడం వలన తెగులు సమస్యలు తగ్గి మంచి దిగుబడి వస్తుందని ఉద్యాన శాఖ అధికారులు సూచిస్తున్నారు.

ప్రతి రైతూ విశిష్ట గుర్తింపు సంఖ్య పొందాలి

వ్యవసాయ అధికారి మురళీకృష్ణ

ప్రజాశక్తి - కెవిబి పురం: కేవీబి పురం మండలంలోని వ్యవసాయ కార్యాలయం లో మంగళవారం ఆర్‌బికేలో పనిచేస్తున్న విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్స్‌తో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అతిథిగా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా రాష్ట్రంలోని ప్రతి రైతుకూ ఒక విశిష్ట గుర్తింపు సంఖ్యను ఇవ్వాలని నిర్ణయించడం జరిగిందని తెలిపారు. ఇందులో భాగంగా రైతు సేవా కేంద్రాలలో నమోదు కార్యక్రమం చేస్తారని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రజాశక్తి-యర్రావారిపాలెం: ఎల్లమంద గ్రామ పంచాయతీలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించినట్లు మండల వ్యవసాయ అధికారి ఖాదర్ భాషా తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏఓ మాట్లాడుతూ రైతులు విశిష్ట గుర్తింపు సంఖ్యను పొందితేనే ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తిస్తాయని తెలిపారు. కావును అందరూ ఆర్‌బికేల్లో నమోదు చేయించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

సింగనాలతూరు గ్రామసభలో రైతుల ఐడీ నమోదు కార్యక్రమం

52 మంది రైతులకు రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు

ప్రజాశక్తి -దొరవారిసత్రం: రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్య తప్పనిసరి అని ఏడి అనిత సూచించారు. మంగళవారం మండల పరిధిలోని సింగనాలతూరులో గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 52 మంది రైతులకు రైతు విశిష్ట గుర్తింపు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిని జ్యోతిర్మయి, సర్పంచ్ మణి,మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు శ్రీనివాస నాయుడు, గ్రామ రైతులు హాజరయ్యారు.

నెయ్యిలో కల్తీ జరిగినట్లు సిట్ చెప్పలేదు

- టెండర్ల వ్యవహారం మాత్రమే ధ్రువీకరించారు
- భూమన కరుణాకరరెడ్డి, టిటిడి మాజీ చైర్మన్

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : సుప్రీంకోర్టు నియమించిన సిట్ బృందం నెయ్యిలో కల్తీ జరిగినట్లు ఎక్కడ చెప్పలేదు, కేవలం టెండర్లు వ్యవహార విషయం మాత్రమే బయటపెట్టారని టిటిడి మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి తెలిపారు. పద్మావతి పురంలోని, ఆయన నివాసంలో మంగళవారం కరుణాకర్ రెడ్డి విలేకరులతో మాట్లాడారు. సిట్ బృందం 4 గురుని అరెస్టు చేసింది కానీ లడ్డు వ్యవహారంలో కల్తీ జరిగినట్లు రిమాండ్ రిపోర్ట్‌లో ఎక్కడ చెప్పలేదన్నారు. దీనిపై ఎల్లో మీడియా వక్రీకరించి ప్రచారం చేస్తోందన్నారు. భోలే బాబా, ఏ.ఆర్.డైరీ, వైష్ణవి డైరీ చేసిన మోసాన్ని మాత్రమే చెప్పడం జరిగిందని వివరించారు. సి.బి. ఐ ఆధ్వర్యంలో సిట్, నెయ్యిలో కొవ్వు, పంది కొవ్వు కలిసినట్లు రిమాండ్ రిపోర్ట్‌లో ఎక్కడ చెప్పలేదున్నారు. సెప్టెంబర్ 20 తేదిన నెయ్యికి బదులు ఎనిమల్ ఫ్యాట్ వాడినట్లు తెల్చారాని, పంది కొవ్వు

వాడారాని దష్ప్రచారం చేశారన్నారు. జులై 6, 12 తేదీల్లో వచ్చిన రిపోర్ట్ నాణ్యత సరిపోలేదు, వనస్పతి ఆయిల్ కలిసినట్లు, వీటిని వెనక్కి పంపించామని ఈవో శ్యామల రావు చెప్పారని గుర్తు చేశకరు. నెయ్యిలో ఏ కల్తీ జరగలేదు, టిటిడి ఈవో శ్యామల రావు స్పష్టం చేశారన్నారు. వైఎస్ ఆర్ కాంగ్రెస్ పాలనలో 2019 -24 కాలంలో 19 సార్లు ట్యాంకర్లు నాణ్యత లేదని వెనక్కి పంపించామన్నారు. 2014- 19 వరకు చంద్రబాబు పాలనలో 15 సార్లు నెయ్యి ట్యాంకర్లు వెనక్కి పంపారన్నారు. తమ పాలనలో నెయ్యి తనిఖీల్లో పారదర్శకత ఉండాలని శ్రీనివాసాచారితో పాటు సి.ఎఫ్.టి.ఆర్‌కు చెందిన 12 మంది సిబ్బందిని తనిఖీలకు పెంచామని తెలిపారు. శ్యాంపిల్ తీసుకుని నాణ్యతవ్వరిశీలించే కార్యక్రమం మా పాలనలో తీసుకువచ్చామన్నారు. కమల వర్ధన్ రిటైర్డు ఐ. ఏ .ఎస్ అధికారితో 46 కోట్లు రూపాయలతో నెయ్యి స్టోర్ అభివృద్ధి పనులు చేపట్టాం అని గుర్తు చేశారు. మా ప్రభుత్వ పాలనలో 8 కోట్లు రూపాయలతో ల్యాబ్ ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామన్నారు.

టిడిపి, చంద్రబాబును మోసే ప్రచార బోయీలు మాపై విష ప్రచారం చేస్తున్నారు. పవన్ కల్యాణ్ ఏకంగా అయోధ్య రామ మందిరం ప్రారంభం రోజు ఆవు కొవ్వు, పంది కొవ్వు కలిసింది అని విష ప్రచారం చేశారని మండి పడ్డారు. కల్తీ పవన్ కళ్యాణ్, చంద్రబాబు ఆలోచనల్లో ఉందని ఎద్దేవా చేశారు. ఈ సమావేశంలో మేయర్ శిరీష, వైసీపీ నాయకులు అజయ్ కుమార్‌లు పాల్గొన్నారు.

చారుమతికి డాక్టరేట్

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా యూనివర్సిటీ ఫార్మసీ విభాగం పరిశోధక విద్యార్థిని సాళ్వ చారుమతికి డాక్టరేట్ ప్రదానం చేసినట్లు వర్సిటీ డీన్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య బి.జీవన జ్యోతి తెలిపారు. ప్రొఫెసర్ రజిత పర్యవేక్షణలో "మెథడ్ డెవలప్మెంట్ అండ్ వాలిడేషన్ ఫర్ ఎస్టిమేషన్ అఫ్ సెలెక్టెడ్ డ్రగ్స్ ఇన్ బల్క్ అండ్ ఫార్మాస్యూటికల్ డోసేజ్ ఫార్మ్ బై లిక్విడ్ క్రోమాటోగ్రఫీ టెక్నిక్స్" అనే అంశంపై పరిశోధన చేసినందుకు డాక్టరేట్ ఇచ్చినట్లు వెల్లడించారు.

అసంఘటిత కార్మికులు ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలి

జిల్లా కలెక్టర్ డా ఎస్.వెంకటేశ్వర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: ప్రతి అసంఘటిత కార్మికుడు తన వివరాలను ఈ -శ్రమ్ పోర్టల్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకొని ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు పొందాలని జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్ సూచించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్, వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఈ - శ్రమ్ పోర్టల్‌పై సంబంధిత లైన్ డిపార్ట్మెంట్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. అసంఘటిత రంగంలో పనిచేసే కార్మికులకే కాకుండా వారి కుటుంబ సభ్యులకు కూడా ఈ పథకం వర్తిస్తుందని తెలిపారు. ఈ ప్రక్రియకు వయసు పరిమితి 16-59 సంవత్సరాలు, ఆదాయపు పన్ను చెల్లించని, పిఎఫ్, ఈ ఎస్ ఐ సదుపాయం లేని వారు నెలకు రూ. 15 వేల లోపుజీతం తీసుకొనేవారు అర్హులు అని తెలిపారు. కార్మికుని ఆధార్ కార్డు నెంబర్ మరియు ఆధార్‌తో లింక్ అయినా మొబైల్ నెంబర్, బ్యాంక్ అకౌంట్ వివరాలు ఉంటే ఈ పథకంలో చేరవచ్చని తెలిపారు. దగ్గరలోఉన్న సచివాలయంలోగానీ, లేదా సి ఎస్ సి సెంటర్‌లో గాని మీ-సేవ కేంద్రం ద్వారా కానీ నమోదు చేసుకో వచ్చని అన్నారు.

తమ వద్ద ఉన్న మొబైల్ ఫోన్ ద్వారా కూడా సెల్ఫ్ రిజిస్ట్రేషన్ చేసుకొనే సదుపాయం కలదని తెలిపారు. ఈ పథకంలో చేరిన వారు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ. 2 లక్షలు ప్రమాద బీమా, అంగవైకల్యం సంభవించినా భీమావర్తిం స్తుందని తెలిపారు. పాక్షిక అంగవైకల్యం కలిగిన వారికి రూ. 1 లక్ష వరకు ఆర్థిక సహాయం పొందవచ్చని అన్నారు.

గ్రంధాలయాన్ని సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గ్రంథాలయాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని నెల్లూరు జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్ ఆనం అరుణమ్మ సూచించారు. చెన్నూరు జిల్లా ప్రజా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో నూతన గ్రంధాలయాన్ని మంగళవారం ఆమె ప్రారంభించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, యం.పి.డి.ఓ మధుసూదన్ రావు, జడ్పీటీసీ ఉటుకూరు యామిని, తెలుగు పార్లమెంట్ మహిళ ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి రెడ్డి, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

టెండరు నోటీసు

THE INSTITUTE OF COST ACCOUNTANTS OF INDIA
(Statutory Body under an Act of Parliament)
Tirupati Chapter, Plot No 50, CMA Bhawan, 1st Floor,
New Balaji Colony, Behind Nilgiris super market,
MR Palli. Tirupati. Cell:9032517501

తిరుపతి చాప్టర్ ఆఫ్ ది ఇన్స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ICMAI) అర్హత కలిగిన సరఫరాదారుల నుండి క్రింది అంశాల కొరకు మూసివేసిన ప్రతిపాదనలను ఆహ్వానిస్తుంది:
ల్యాప్‌టాప్ - 20 యూనిట్లు, ప్రోజెక్టర్ - 1 యూనిట్
ఆసక్తి కలిగిన బిడ్డరు టెండర్ పత్రాన్ని క్రింది లింకులు నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు: https://eicmai.in/chapteradmin/Chapter-Website/Default.aspx and https://icmaitpt.com/
టెండర్ ముగింపు తేదీ: 13 ఫిబ్రవరి 2025, సాయంత్రం 05:00 గంటలు సమర్పించబడే కోట్ చైర్మన్‌కు ఉద్దేశించబడాలి మరియు ఇన్స్టిట్యూట్ ఫస్ట్ ఫ్లోర్‌లో లభ్యమయ్యే టెండర్ బాక్స్‌లో సమర్పించాలి:
చైర్మన్,ఇన్స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా - తిరుపతి చాప్టర్CMA భవన్, 1వ అంతస్తు, న్యూ బాలాజీ కాలనీ,ప్లాట్ 50, నిల్‌గిరిస్ సూపర్ స్టోర్ వెనుక,ఎం. ఆర్. పల్లి, తిరుపతి, ఆంధ్రప్రదేశ్ 517501. బిడ్డరు టెండర్ పత్రంలో పేర్కొన్న మార్గదర్శకాలకు అనుగుణంగా వారి ప్రతిపాదనలు సమర్పించాలి. గడువు ముగిసిన తరువాత సమర్పించిన బిడ్లు పరిగణించబడవు.

సెక్రటరీ, ICMAI
తిరుపతి చాప్టర్

గిరిజనుల దారి సమస్య పరిష్కరించండి

సమావేశంలో సిఐటియు నాయకులు

ప్రజాశక్తి - నాయుడుపేట: నాయుడుపేటలోని కామ్రేడ్ వెదనపత్తి సుందర్ రామిరెడ్డి భవన్ సిఐటియు కార్యాలయంలో స్థానిక భుపయ్య కాలనీ వాసులైన గిరిజనుల సమస్యపై సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో సిపిఎం పార్టీ నాయకులు శివకవి ముకుంద, జిల్లా నాయకులు అరిగేల పుల్లయ్య పాల్గొన్నారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ భూపయ్య కాలనీలో నిరుపేదలైన గిరిజనులు పాచి పని, కూలి పనులు చేసుకుంటూ నలభై సంవత్సరముల నుండి జీవనం సాగిస్తున్నారని తెలిపారు. ఆ కాలనీలో వారికి కనీసం మురికి కాలువలు, సరైన రోడ్లు కూడా లేక దుర్భర పరిస్థితులను ఎదుర్కొంటున్నారని తెలిపారు. పట్టణ పరిధిలోనే ఉంటూ ఇంత దారుణమైన పరిస్థితుల్లో వారు బ్రతుకుతున్నారని ఆవేదన వెలిబుచ్చారు. ఇలాంటి పరిస్థితుల్లో వారు నివసిస్తుండగా, ఆ కాలనీలో ఒక పెట్టుబడి దారుడు, కాలనీ నుంచి బయటకు వెళ్లేందుకున్న దారికి అడ్డంగా గోడ నిర్మించి వారిని ఇబ్బందులకు గురి చేస్తున్నాడని మండి పడ్డారు. ఈ సమస్యపై ప్రభుత్వం వెంటనే స్పందించి దారి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఈ విషయంలో వెంటనే స్పందించని పక్షంలో, పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం నాయకులు అక్రపాక పుట్టయ్య, వెంకయ్య, ఎం.వెంకటేశ్వర్లు, ఏ.అంకయ్య, గోపి, మునుస్వామి తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ సమస్యలపై జేసీకి ఎమ్మెల్యే ఆదిమూలం వినతి

ప్రజాశక్తి - పిచ్చాటూరు: సత్యవేడు మండల పరిది లో మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో లే అవుట్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్‌ను ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం కోరారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జేసీ ఛాంబర్‌కు వెళ్లి వినతి పత్రం సమర్పించారు. జేసీ సాను కూలంగా స్పందించారని, త్వరలో తగు చర్యలు తీసుకుంటామని జేసీ తెలిపినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. అనంతరం ఎమ్మెల్యే జిల్లా ఎపి ఎస్పీడీసీఎల్ కార్యాలయానికి చేరుకొని, సత్య వేడు నియోజకవర్గంలో మంజూరైన నూతన విద్యుత్ సబ్ స్టేషన్‌లకు టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి పనులు చేపట్టాలని సీఎండీ కే.సంతోష రావును కోరారు.

క్రైం న్యూస్

కుటుంబంలో ముగ్గురు అదృశ్యం

సుభాషిణి మునిప్రియ కిషోర్

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒకే కుటుంబంలో ముగ్గురు కనపడకుండా పోయిన ఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. లక్ష్మీపురంలో నివాసం ఉన్న వెంకటేష్ తన భార్య సుభాషిని (45), కొడుకు కిషోర్ (26), కూతురు మునిప్రియ (21)లు కనబడుటలేదని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కుటుంబం ఆర్థిక వ్యవహారంతో భార్య బిడ్డల మధ్య గొడవలు వచ్చాయని, దీంతో రెండు రోజులుగా భార్య పిల్లలు కనబడటం లేదని, పోలీసులకు తెలిపారు. వెంకటేష్ ఫిర్యాదు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసినవారు 9440796748, 6303477198 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

హత్యాయత్నంపై కేసు నమోదు చేయాలి

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చింతల శివరాం ప్రసాద్

బాలాయపల్లి - ప్రజాశక్తి : మేల్చూరు గ్రామానికి చెందిన చింతల శివరాం ప్రసాద్, అతని భార్యలపై దాడి చేసిన వారిపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని, రైతు కూలి సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మంగళవారం వి.వి.రమణయ్య డిమాండ్ చేశారు. చింతల శివరాం ప్రసాద్‌పై అదే గ్రామానికి చెందిన కాసరం వెంకట్ రాజేష్ పాత కక్షలు పెట్టుకొని మరో ముగ్గురితో వచ్చి కర్రలతో దాడి చేశాడు. అడ్డువచ్చిన శివరాం ప్రసాద్ భార్య ధనలక్ష్మిపై కూడా దాడి చేశారు. ఈ దాడిలో తలకు బలమైన గాయం కావడంతో శివరాం ప్రసాద్‌ను ఆసుపత్రికి తరలించారు. అతని ఇంటి స్థలాన్ని కాజేయడానికి ప్రయత్నిస్తున్న వ్యక్తులను నిలువరించి, దాడి చేసిన వారిపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని రైతు కూలీ సంఘం డిమాండ్ చేస్తోందని రమణయ్య వెల్లడించారు.

అదృశ్యమైన బాలికలను తల్లిదండ్రులకు అప్పగింత

వివరాలను వెల్లడిస్తున్న డిఎస్పీ గీతా కుమారి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, జానకిరామ్ పేటలో ఉన్న ప్రభుత్వ గిరిజన హాస్టల్ నుండి అదృశ్యమైన ఇద్దరు బాలికలు డక్కిలి మండలం, శ్రీపురంలో వారి బంధువుల ఇంట ఉన్నారని బాలికలను వారి తల్లిదండ్రులకు అప్పగించడం జరిగిందని గూడూరు డిఎస్పి గీతా కుమారి వెల్లడించారు. మంగళవారం సబ్ డివిజనల్ పోలీస్ కార్యాలయంలో ఆమె విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ గిరిజన పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న ఇద్దరు బాలికలు సోమవారం మధ్యాహ్నం నుండి కనిపించలేదని, అధ్యాపకులు ఫిర్యాదు చేశారని తెలిపారు. వెంటనే పోలీసు బృందాలు గాలించి, బాలికలు శ్రీపురంలో వారి బంధువుల ఇంటి వద్ద ఉన్నారని గుర్తించడం జరిగిందన్నారు. మానసిక ఒత్తిడితో పాఠశాల నుండి వెళ్లి పోయామని బాలికలు తెలియజేశారన్నారు. బాలికలను వారి కుటుంబ సభ్యులకు అప్పగించామని తెలిపారు. ఈ సమావేశంలో రెండో పట్టణ సీఐ శ్రీనివాస్, ఎస్ఐ రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చేయూత

ఆర్థిక సాయమందిసున్న దృశ్యం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, 7వ వార్డ్ అశోక్ నగర్‌లో స్వర్గస్తులైన అన్నెం పెంచలమ్మ కుటుంబానికి, గూడూరు శాసన సభ్యులు పాశం సునీల్ కుమార్ సూచనల మేరకు స్థానిక నాయకులు తూపిలి శ్రీనివాసులు, బండి సాయి కృష్ణలు 5 వేల రూపాయలు ఆర్థికసాయమందించారు.

यूनियन बैंक ऑफ इंडिया Union Bank of India
भारत सरकार का उपक्रम A Goverment of India Undertaking

ఎయిర్‌బైపాస్‌రోడ్డు శాఖ(10821),
19 న్యూ బాలాజి కాలనీ,
ఎయిర్‌బైపాస్‌రోడ్డు, తిరుపతి, తిరుపతి
జిల్లా - 517502, ఫోన్: 83568 10821

స్వాధీనతా ప్రకటన(లాంఛనంగా) రూల్ నెం.8(1) క్రింద (స్థిరాస్తి కోసం)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002(54 ఆఫ్ 2002)లోని రూల్ 3తో చదువబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారములను వినియోగించుకుంటూ **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఎయిర్‌బైపాస్‌రోడ్డు శాఖ,19, న్యూ బాలాజి కాలనీ, ఎయిర్‌బైపాస్‌రోడ్డు, తిరుపతి, తిరుపతి జిల్లా** యొక్క అధీకృత అధికారియగు దిగువ సంతకందారు **తేది: 25.11.2024న** డిమాండ్ నోటీసు జారీ చేసి దిగువ రుణగ్రహీతలను నోటీసులు అందుకున్న తేది నుండి 60 రోజులలోగా సంబంధిత డిమాండ్ నోటీసులలో దిగువ తెలిపిన రుణ మొత్తాలను తిరిగి చెల్లించాల్సింగా కోరారు.

వ. నెం.	రుణగ్రహీత/ హామీదారుపేరు మరియు చిరునామా	బకాయి మొత్తం రూ.లలో	తనఖాలో వున్న ఆస్థి వివరములు
1	**రుణగ్రహీతలు** **శ్రీ బుక్కే రవీంద్ర నాయక్** తండ్రి బి.రామమూర్తినాయక్ **శ్రీమతి మూడే సంగీత** భర్త బుక్కే రవీంద్ర నాయక్	**తేది:20.11.2024నాటికి రూ.30,87,143.57 +తేది: 20.11.2024 నుండి తదుపరి వడ్డీ మరియు ఇతర ఖర్చులు**	తిరుపతి జిల్లా, రేణిగుంట సబ్ జిల్లా, తిరుపతి రూరల్ మండలం, తిరుచానూరు గ్రామ పంచాయతీ, వార్డునెం.9, దామినేడు లెక్కదాఖలా, లక్ష్మీనగర్, చదలవాడ ఇంజినీరింగ్ కాలేజ్ వెనుక వైపు, సర్వేనెం.140/5 ప్లాటు నెం.39సి (దక్షిణం వైపు భాగం)లోని డి.నెం.9-109/45 గల నివాసయోగ్యమైన భూమి మరియు బిల్డింగ్ విస్తీర్ణం 1500 చ.అ. శ్రీ బుక్కే రవీంద్రనాయక్ పేరున వున్నది.హద్దులు: తూర్పు: ప్లాటు నెం.39 గల స్థలం, పడమర: 40అ. వెడల్పు గల రోడ్డు, ఉత్తరం: కె.మధురెడ్డి యొక్క ప్లాటు నెం.39సి(భాగం), దక్షిణం: ప్లాటు నెం.39బి లోని డి.నెం.9-109/46 గల ఎస్.ఎస్.సుజాత ఇల్లు.
2	**రుణగ్రహీతలు** వై.కె.పెయింట్స్ (ప్రొప్రయిటర్ సంస్థ) **మరియు తోకల యువకిశోర్** (ప్రొప్రయిటర్) **కో-ఆబ్లిగెంట్ / గ్యారంటారు** **శ్రీమతి సిహెచ్.వీణ** భర్త టి.యువకిశోర్	**తేది:31.10.2024 నాటికి రూ.58,41,551.89 +తేది: 31.10.2024 నుండి తదుపరి వడ్డీ మరియు ఇతర ఖర్చులు**	తిరుపతి జిల్లా, తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్, తిరుపతి అర్బన్ మండలం, నెం.9 అక్కారంపల్లి గ్రూపు మరియు గ్రామలెక్కదాఖలా, అక్కారంపల్లి ఏరియా, వార్డునెం.22, సుబ్బారెడ్డినగర్, సర్వే నెం.121/5, ప్లాటునెం.12 పార్ట్‌లోని డి.నెం.22-6-61/1బి గల నివాసయోగ్యమైన భూమి మరియు బిల్డింగ్ యొక్క విస్తీర్ణం 825చ.అ. లేదా 91.66 చ.గ. శ్రీ తోకల యువ కిశోర్ పేరున వున్నది. హద్దులు: తూర్పు: ప్లాటు నెం.12(పార్ట్), పడమర: ప్లాటు నెం.13 స్థలం, ఉత్తరం: ప్లాటు నెం.7 స్థలం, దక్షిణం: రోడ్డు

సదరు మొత్తమును తిరిగి చెల్లించుటలో రుణగ్రహీతలు/ గ్యారంటార్లు విఫలమైనందున సదరు రూల్స్ యొక్క రూల్ 8 తో చదువబడే సెక్షన్ 13 సబ్‌సెక్షన్ 4 క్రింద అతనికి సంక్రమించిన అధికారములను వినియోగించుకుంటూ పైన తెలిపిన ఆస్తులను దిగువ సంతకందారు **06.02.2025** న స్వాధీనం చేసుకున్నారని రుణగ్రహీత(లు)/ గ్యారంటార్లకు మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలముగా తెలియ జేయడమైనది. సదరు ఆస్తులతో ఏ వ్యవహారం జరుపరాదని ముఖ్యంగా రుణగ్రహీత(లు)/ గ్యారంటారు(లు) మరియు సాధారణ ప్రజలను ఇందులమూలముగా హెచ్చరించడమైనది మరియు సదరు ఆస్తులతో ఏవేని వ్యవహారాలు జరుపదలిస్తే **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఎయిర్‌బైపాస్‌రోడ్డు శాఖ,19, న్యూ బాలాజి కాలనీ, ఎయిర్‌బైపాస్‌రోడ్డు, తిరుపతి,** వారికి. పై నోటీసులో పేర్కొనబడిన బాకీలు మొత్తం + వడ్డీ + ఇతర ఖర్చులను చెల్లించుటకు లోబడి ఆ విధంగా చేయవచ్చును. **సదరు చట్టంలోని సెక్షన్ 13 సబ్ సెక్షన్8 క్రింద రుణగ్రహీత తమ యొక్క ఆస్తులను తిరిగి పొందేందుకు సమయం కేటాయించడమైనదని గమనించగలరు**

ప్రదేశం: తిరుపతి
తేది : 06.02.2025

సం॥చీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి,
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా